క్లుప్తంగా

బాల్య వివాహాలను అరికట్టాలి

పీలేరు : మసీదులలో పెద్దల సమక్షంలో జరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టాలని ప్రభుత్వ ఖాజీ కె.ఎస్. నవాజుద్దీన్ కోరారు. మంగళవారం తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో మసీదులలో నిర్వాహకులు చట్ట వ్యతిరేకంగా వివాహాలు జరిపిస్తున్నారని తెలిపారు. సక్రమమైన ధృవపత్రాలు లేకుండా వివాహాలు జరపడం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. మరోవైపు వారి కుటుంబాల శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోందని తెలిపారు. నిర్ణీత రుసుముకన్నా ఎక్కువగా వసూలు చేస్తూ సొంత రసీదు పుస్తకాలతో వివాహాలు జరిపిస్తున్నారని ఆరోపించారు. బాల్య వివాహాలు అరికట్టాల్సిన ఐసీడీఎస్ అధికారులు మసీదుల వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

19న ఉచిత వైద్య శిబిరం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ వారి సహకారంతో ఈ నెల 19న మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శిబిరంలో గుండె, కేన్సర్, ఎముకలు, కీళ్ళ వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు విచ్చేస్తారని, పరిసర ప్రాంతాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చేనేత కార్మికుడికి ఆర్థిక సాయం

మదనపల్లె సిటీ : అనారోగ్యంతో బాధపడుతున్న చేనేత కార్మికుడు వెంకటేష్‌కు ఏపీఎస్‌యూఎఫ్ సభ్యులు మంగళవారం ఆర్థిక సహాయం చేశారు. మదనపల్లె పట్టణం రాంరెడ్డి లేవుట్‌కు చెందిన వెంకటేష్ చేనేత మగ్గం నేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల అతనికి అనారోగ్యంతో బాధపడుతుండటంతో విషయం తెలుసుకుని రూ.5 వేలు నగదును అందజేశారు.

నాటుసారా స్వాధీనం

మదనపల్లె : ఎక్సైజ్ అధికారులు మండలంలో నిర్వహించిన దాడుల్లో సారా వండుతున్న మహిళను అరెస్ట్ చేయడంతో పాటుగా 52 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 120 లీటర్ల బెల్లం, తుమ్మచెక్క ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ భీమలింగ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మండలంలోని దాదినాయునితండాకు చెందిన బుక్కే సురేష్ భార్య సవిత(19) అటవీ ప్రాంతంలో సారా వండుతుండగా అరెస్ట్ చేశామన్నారు. ఆమె నుంచి 52 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, 120 లీటర్ల ఊటను ధ్వంసం చేశామన్నారు. అదే సమయంలో ఎక్సైజ్ పోలీసులను చూసి ఘటనాస్థలంలో నుంచి పారిపోయిన నిందితురాలు సవిత భర్త సురేష్‌నాయక్(31)ను ఇదే కేసులో రెండో ముద్దాయిగా చేర్చామని, త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జబీవుల్లా, కానిస్టేబుళ్లు నాగరాజు, మధు, రేఖ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

పీలేరు : అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్ర అధికారి ఎస్. మస్తాన్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లోభాగంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అగ్ని ప్రమాదాల నివారణపై డెమో చేసి చూపించారు. కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14 ముంబాయి ఓడరేవులో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 231 ప్రజలు చనిపోయార్నారు. 476 మంది క్షతగాత్రులు అయ్యారన్నారు. వీరితోపాటు 66 మంది అగ్నిమాపక సిబ్బంది మృతి చెందారన్నారు. వీరికి ఆత్మకు శాంతి చేకూర్చాలని అప్పటి నుంచి ప్రతి ఏటా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అగ్నిప్రమాదాల పట్ల ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగితే 101కు గానీ 08584-244299 నెంబర్లకు కాల్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



పీలేరు : అగ్నిప్రమాదాలపై డెమో నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదం సంభవిస్తే సమాచారం అందించండి

ములకలచెరువు : అగ్ని ప్రమాదాలు సంభవిస్తే వెంటనే సమాచారం అందించాలని ములకలచెరువు సర్కిల్ ఫైర్ అధికారి నరసింహులు కోరారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అనంతరం అగ్నిమాపక యంత్రంలోని పరికరాల పనితీరు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

దారి సమస్యను తక్షణం పరిష్కరించాలి

రాయచోటి అర్బన్ : జిల్లాలోని తంబళ్లపల్లె మండలం ఎద్దులవారిపల్లె గ్రామం దండువారిపల్లెలో నెలకొన్న దారి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి ఎం.విశ్వనాథ, జిల్లా కమిటీ సభ్యుడు భీమవరం వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దారి సమస్యలను పరిష్కరించాలంటూ మంగళవారం దండువారిపల్లె గ్రామస్తులతో కలసి కలెక్టరేట్ ఎదుట ధర్నాను నిర్వహించారు. వారు మాట్లాడుతూ దండువారిపల్లెకు చెందిన వై.క్రిష్ణమ్మ, రమేష్‌రెడ్డిలు తమ పొలానికి అనుకొని ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించారన్నారు. గ్రామంలోని ప్రజలు పొలాల వద్దకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయాన్ని తంబళ్లపల్లె తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని దారిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దండువారిపల్లెకు చెందిన రైతులు శంకరయ్య, మల్లికార్జున, కుమార్, సిద్దయ్య, శ్రీరాములుతో పాటు పలువురు పాల్గొన్నారు.



ధర్నాచేస్తున్న దండువారిపల్లె రైతులు

విద్యతోనే సమసమాజ స్థాపన

తంబళ్లపల్లె : విద్యతోనే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని నమ్మిన ప్రపంచ విద్యావేత్త, మహోదార్శనికుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని బీసీ సంఘం నాయకులు ఎం.చంద్రశేఖర్, మాలమహానాడు రాజశేఖర్ అన్నారు. మంగళవారం పాత కాలేజీ మైదానంలోబి.ఆర్. అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలతో పూజలు చేసి ఘనంగా నివాళులు అర్పించారు. పారిశ్రామికవేత్త, మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి ఆర్థిక సహాయంతో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు విద్యాసామగ్రి, పుస్తకాలు పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజు, హెచ్‌ఎం రెడ్డప్పరెడ్డి, శేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఎస్‌ఎంసీ చైర్మన్ శివకుమార్, ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న శేఖర్‌రెడ్డి

వైభవంగా అంబేద్కర్ శోభాయాత్ర

మదనపల్లె : భారత రాజ్యాంగ శిల్పి, ఆధునిక భారత నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 134వ జయంతి వేడుకల్లో భాగంగా, భారతీయ అంబేద్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో మదనపల్లె పట్టణంలో నిర్వహించిన 'అంబేద్కర్ శోభయాత్ర' వైభవోపేతంగా జరిగింది. సోమవారం రాత్రి 8 గంటలకు స్థానిక మిషన్ కాంపౌండ్ వద్ద బాస్ వ్యవస్థాపకుడు పీటీయం శివప్రసాద్ తో కలిసి, దళిత సంఘర్షణ సమితి (డిఎస్ఎస్) కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేష్ దంపతులు జెండా ఊపి అంబేద్కర్ శోభాయాత్రను ప్రారంభించారు. విద్యుత్ దీపాలతో, ప్రత్యేకంగా అలకరించిన ట్రాక్టర్ మీద అంబేద్కర్ చిత్రపటంతో ఏర్పాటు చేసిన అంబేద్కర్ శోభాయాత్ర పిల్లనగ్రోవి నృత్యం, లంబాడి నృత్యం, కోలాటం, చక్కభజన, డప్పులు, మేళతాలలతో కన్నుల పండుగలా సాగింది. దారిపొడవునా బాణాసంచా పేల్చారు. పెద్దఎత్తున పూలను చల్లుతూ శోభాయాత్రను పూలపై నడిపించారు. పోలీసులు పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. శోభాయాత్రకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కర్ణాటక డి.ఎస్.ఎస్ నేత ఎన్. వెంకటేష్, బాస్ అధినేత పీటీయం శివప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాతగా అంబేద్కర్ అందించిన బహుముఖ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బాస్ నాయకులు నీరుగట్టి రమణ, టి.ఎ. పీర్ బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి చాట్ల బయన్న, రాష్ట్ర గిరిజన సమాఖ్య అధ్యక్షుడు కోనేటి దివాకర్, లంబాడి హక్కుల పోరాట సమితి నాయకుడు నాగూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ భానుమూర్తిరావు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ మండల పరిధిలో 21 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగి, రేషన్ కార్డు కలిగిన నిరుద్యోగులు స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసి, సంబంధిత కుల, విద్యార్హత తదితర పత్రాలను మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు. మే 10లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారమే అజెండాగా పనిచేయాలి

- సమన్వయంతో మండల అభివృద్ధి
- ఎంపీపీ ఎంజి. భూదేవి
- బందోబస్తు మధ్య మండల మీట్



మండల మీట్‌లో మాట్లాడుతున్న ఎంపీపీ ఎంజి భూదేవి

కురబలకోట : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి తోడ్పడాలని కురబలకోట కొత్త ఎంపీపీ ఎంజి. భూదేవి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల మీట్ నిర్వహించారు. రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మొదటి నుంచి చివరి వరకు సాఫీగా సాగింది. మండల మీట్‌లో ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు నిర్దిష్ట అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించడానికి చొరవ చూపాలన్నారు. వివిధ శాఖల అధికారులు కూడా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్య సాధనకై కృషి చేయాలన్నారు. ఎవరి స్థాయిలో వారు పని చేస్తూ మండలాన్ని నెంబర్ వన్ స్థానంలో నిలపాలన్నారు. ముఖ్యంగా వేసవిలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా పని చేయాలన్నారు. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ప్రగతిపై సమీక్షించారు. కడప క్రాస్ గ్రామంలో కొత్తగా మూడు తాగునీటి బోర్లు వేయడం జరిగిందని నీళ్లు కూడా పుష్కలంగా పడ్డాయని అయితే మూడు నెలలు కావస్తున్నా ఇంతవరకు వాటిని ప్రజా వినియోగంలోకి ఎందుకు తీసుకురాలేదని ముదివేడు ఎంపీటీసీ వైజీ సురేంద్ర యాదవ్ ప్రశ్నించారు. అదే విధంగా పిల్లలు లేని చోట అంగన్‌వాడీ స్కూళ్లు ఉన్నాయని ఉన్న చోట మాత్రం అంగన్‌వాడీలు లేవని అవసరమైన చోట కొత్తవాటిని ఏర్పాటు చేయాలన్నారు. మండల అభివృద్ధిలో పార్టీలను చూడమని సర్పంచులు, ఎంపీటీసీలు తమ ప్రాంత అభివృద్ధికి పాటుపడాలన్నారు. పార్టీలకు అతీతంగా పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. పశు సంవర్ధక శాఖ పశువుల బీమా సక్రమంగా అమలు చేయాలని కనసానివారిపల్లె ఎంపీటీసీ ముదివేటి ఆనందరెడ్డి అధికారులను కోరారు. పశువులు చనిపోతే రైతులు బీమా కోసం అగచాట్లు పడాల్సి వస్తోందని దీనిని నిలువరించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ బైసాని జ్యోతి, ఎంపీడీఓ గంగయ్య, తహసీల్దారు తపస్విని, వైస్ ఎంపీపీ ఎస్. వెంకట్రమణారెడ్డి, ఎంపీటీసీలు ఎం. ఆనంద రెడ్డి, నిర్మల, త్రివేణి, టి. నరసమ్మ, సర్పంచులు పోరెడ్డి విశ్వారెడ్డి, ఆర్కే కృష్ణారెడ్డి, సుక్కా సుజాత, సోమిరెడ్డి, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

పులి దాడిలో నష్టపోయిన రైతుకు పరిహారం

నిమ్మనపల్లె : మండలంలో గత సంవత్సరం అక్టోబర్‌లో జరిగిన పులి దాడి ఘటనలో పశువును నష్టపోయిన రైతుకు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మంగళవారం నష్టం పరిహారం చెక్కును అటవీశాఖ అధికారులతో కలసి అందజేశారు. మండలంలోని ముష్టూరు పంచాయతీ, చల్లావారిపల్లెకు చెందిన రైతు ఆదెన్న పశువులను వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఉండగా చిరుత పులి పశువుల కొట్టంపై దాడి చేసి, ఓ పశువును ఈడ్చుకెళ్ళి చంపి తినేసింది. ఘటనలో కుటుంబానికి ఆధారమైన పశువును కోల్పోయి ఆదెన్న ఇబ్బంది పడుతూ తనకు సాయం చేయాల్సిందిగా అధికారులను ఆశ్రయించాడు. బాధిత రైతుకు పరిహారం చెల్లింపు కోసం అటవీశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపగా, ప్రభుత్వం పశు నష్టపరిహారం కింద మంజూరు చేసిన రూ.20 వేల నష్టపరిహారం మంజూరు చేసింది.

దేశవాళి వంగడాలను రక్షించుకోవాలి

కలికిరి : దేశవాళి వంగడాలను రక్షించుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకులు డా. వి.సుమతి అన్నారు. స్థానిక కేవీకే కార్యాలయంలో మంగళవారం దేశవాళి పంటల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రైతులు వరి, చిరుధాన్యాలు, నూనెగింజ పంటలు, ఆపరాలు, కాయకూరలు, పండ్లు, పూలు, పసుపు, చింత తదితరాలను ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ రైతులను విచారించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో తిరుపతి వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డా. జాన్, డా. రూపేష్‌కుమార్‌రెడ్డి, డా. శ్రీవల్లి, జిల్లా సేంద్రియ వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్, ఆర్‌డీటీ మురళి, ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. స్వరాజ్యలక్ష్మి, కేవీకే శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



కేవీకేలో జరిగిన కార్యక్రమంలో రైతులతో అధికారులు, శాస్త్రవేత్తలు

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నిమ్మనపల్లె : అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. మంగళవారం నిమ్మనపల్లెలో డ్వాక్రా మహిళల టైలరింగ్ శిక్షణ కార్యక్రమం, సాధికార సారధుల అవగాహన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్న సంకల్పంతో ప్రభుత్వం టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి, కుట్టు మిషన్లు అందిస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు బలంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పరమేశ్వర్ రెడ్డి, తహసిల్దార్ అమర్నాథ్, ఏపీఎం మురళి, ఏపీవో రమేష్, ఎంఈఓలు నారాయణ, పద్మావతి, నాయకులు పుర్రా వెంకటరమణ, ఆర్ జే వెంకటేష్, రాజన్న, రెడ్డప్ప రెడ్డి, శ్రీపతి, సర్పంచ్ మధు, పాపులమ్మ మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత రాజకీయాలు సహించేది లేదు

రామసముద్రం : వ్యక్తిగత రాజకీయాలకు పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. మంగళవారం ఆయన మండలంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణపై వైద్యాధికారి డాక్టర్ లీలా డీఎంహెచ్ఓ కు ఫిర్యాదు చేయడంపై ఎమ్మెల్యే ఆసుపత్రిని తనిఖీ చేసి సిబ్బందితో సమీక్షించారు. అనంతరం టీటీడీ కళ్యాణ మండపంలో ఐకెపి మహిళా సంఘాలకు నిర్వహించిన సమావేశంలో రూ.7కోట్ల స్త్రీ నిధి చెక్కును మహిళలకు అందజేశారు. ఎంపీడీవో భాను ప్రసాద్, ఐకేపీ ఏపీఎం సాంబశివ,అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లైబ్రరీకి పంచమవేదం పుస్తకాలు వితరణ

మదనపల్లె సిటీ : స్థానిక సీటీఎం రోడ్డులోని శాఖ గ్రంథాలయంకు గ్రామీణ బ్యాంకు విశ్రాంత రీజనల్ మేనేజర్ కోటేశ్వరరావు టీటీడీచే ముద్రించిన పంచమవేదం పుస్తకాలను వితరణగా అందజేశారు. ఈ పుస్తకాలను లైబ్రరీలో పాఠకుల కోసం ఉంచాలని ఆయన కోరారు. లైబ్రరీకి మరిన్ని పుస్తకాలు అందజేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వసంతకుమారి, విశ్రాంత కమిషనర్ వాసుదేవరావు, విశ్రాంత గ్రంథాలయాధికారి జనార్థన్‌రెడ్డి, గొల్లపూడి తిరుపతిరావు, మునిరత్నం, టీ.ఎస్‌పి క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

వారపుసంతలో మజ్జిగ పంపిణీ

మదనపల్లె సిటీ : స్థానిక కాలేజీ వద్దనున్న వారపు సంతలో మంగళవారం ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో వేసవి దృష్టిలో ఉంచుకుని మజ్జిగ పంపిణీ చేశారు. మార్కెట్‌కు వచ్చిన రైతులు, పాదాచారులకు మజ్జిగ అందజేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా మజ్జిగ పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ జ్యోతి తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు విష్ణుప్రియ,ఖాజావల్లి, మోహన్‌వల్లి, వనజ,ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాడిఆవు మృతి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం పంచాయతీ విసనకర్రవాండ్లపల్లిలో వెంకటస్వామి అనే రైతుకు చెందిన రూ.లక్ష విలువ చేసే పాడిఆవు మంగళవారం మృతి చెందింది. తాను యూరియా నీళ్ళు కలిపిన బకెట్‌ను ఓ పక్కన పెట్టి వ్యవసాయ పనులు చేసుకుంటుగా పాడి ఆవు సదరు నీళ్ళు తాగి అక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు బాధిత రైతు వాపోయాడు. కుటుంబ తాను జీవనోపాధి కోసం ఇటీవలే ఆవును కొనుగోలు చేసానని రైతు ఆవేదన వ్యక్తం చేసాడు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

రామసముద్రం : రామసముద్రం పోలీస్ స్టేషన్ ను మంగళవారం మదనపల్లి నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మహేంద్ర తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసులపై, మండలం స్థితిగతులు, అక్రమ రవాణా, సరిహద్దులపై ఎస్‌ఐ రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలో శాంతిభద్రతల కు విఘాతం కలగకుండా సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. అలాగే కర్ణాటక మద్యం, పేకాట, కోడిపందేలు, అసాంఘిక కార్యక్రమాలు, గ్రామాల్లో కక్ష్య రాజకీయాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు.